
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 22.710 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1,526 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.61,030
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -రూ.5,490
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,655
నవర (8 గ్రా) - రూ.45,240

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /26.3

శనివారం గాలిలో తేమ 71 శాతం ఉంది. ఆదివారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మట్టి గణపతులతో పర్యావరణం భద్రం

- ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నెల్లూరు జిల్లా ఈఈ రాజశేఖర్
- సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల తయారీపై విద్యార్థులకు శిక్షణ
- చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు పోటీకి విశేష స్పందన



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్

నెల్లూరు(బృందావనం): పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతి ప్రతిమలను తీర్చిదిద్దిన విద్యార్థులు భావితరాలకు చైతన్యదీపికలని, మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణం భద్రంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నెల్లూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ తెలిపారు. 'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కవాతు మైదానం సమీపంలో బ్రహ్మానందపురంలోని ప్రశాంతినగర్‌లో ఉన్న అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు శనివారం 'చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు శిక్షణ శిబిరం' నిర్వహించారు. వినాయకచవితి పండగను పురస్కరించుకుని సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా మట్టి గణపతి ప్రతిమల తయారీపై శిక్షణ ఇచ్చారు. బొజ్జగణపయ్యలను తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వినాయకచవితి పండగంటేనే పర్యావరణ పరిరక్షణతో ముడిపడిన పర్వదినమన్నారు. గణనాథుడు సకల గుణాలకు ప్రతిరూపమని, ప్రతి కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలంటే గణనాథుడిని పూజించడం భారతీయ సంప్రదాయమని పేర్కొన్నారు. గణనాథుడి ప్రతిమలను బంకమట్టితో రూపొందించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని సూచించారు. బంకమట్టితో చిట్టి గణపతులను తయారు చేయడంపై సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ యాజమాన్యం భాగస్వామ్యంతో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు. కాలుష్యాన్ని పెంపొందించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌కు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.





తాము తయారు చేసిన మట్టి గణపతులతో విద్యార్థులు

ప్రకృతికి భంగం కలగకుండా పండగ జరుపుకుందాం – పెనుబల్లి కృష్ణచైతన్య

అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య మాట్లాడుతూ పర్యావరణానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా వినాయకచవితి వేడుకలను జరుపుకోవాలని విద్యార్థులకు వివరించారు. మట్టి గణపతులను పూజించడంలో భావిభారత పౌరులైన విద్యార్థులను భాగస్వామ్యం చేయడం హర్షణీయమన్నారు. భూమి, నీరు, గాలి కలుషితం కాకుండా మట్టి గణపతులను పూజించాలని సూచించారు. ఈ విషయంపై విద్యార్థులు ఇరుగు పొరుగు వారిని చైతన్యపరచాలని తెలిపారు.

పర్యావరణ రక్షణలో నేటితరం విద్యార్థులు – నీరా ప్రసాద్

అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ ప్రిన్సిపల్ నీరా ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ రక్షణలో నేటితరం విద్యార్థులు పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. బాల్యం నుంచే బంకమట్టితో తయారు చేసిన గణనాథులను పూజిస్తే భావితరాల మనుగడ ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన గణనాథుడి ప్రతిమలు కాలుష్య కారకాలవుతాయన్నారు.

ఎంతో ఆనందంగా ఉంది – విద్యార్థులు

వినాయకచవితి పండగ సందర్భంగా విద్య, బుద్ధిప్రదాత అయిన గణపతి ప్రతిమలను తాము తయారుచేయడం ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు. బంకమట్టితో తామే స్వయంగా వినాయకుడి బొమ్మలు తీర్చిదిద్దడం తమకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. అలాగే బహుమతులను అందుకోవడం మరింత సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నెల్లూరు అసిస్టెంట్ ఇంజినీర్ శశికళ, అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ సురేష్, సాక్షి నెల్లూరు బ్రాంచ్ మేనేజర్ ఎన్.శ్రీనివాస్, సాక్షి అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ ఎస్.జయరాజ్, అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ బోధన, బోధనేతర సిబ్బంది, సాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టి చేతుల్లో మెరిసిన బొజ్జగణపయ్యలు



వినాయకచవితి పండగ సందర్భంగా నిర్వహించిన మట్టి గణపతుల తయారీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ డ్రాయింగ్ మాస్టర్ శ్రీనివాసరావు బంకమట్టితో గణనాథులను ఎలా తీర్చిదిద్దాలో వివరించారు. సాక్షి మీడియా గ్రూప్ అందించిన సామగ్రితో చిన్నారులు రూపొందించిన బొజ్జగణపయ్య ప్రతిమలు భిన్నరూపాల్లో చూడముచ్చటగా కనువిందు చేశాయి. సృజనాత్మకతకు పదునుపెడుతూ చిన్నారులు తాము తీర్చిదిద్దిన బొజ్జగణపయ్యలను చూసుకుని మురిసిపోయారు.



మట్టితో వినాయక ప్రతిమ తయారీపై శిక్షణ ఇస్తూ..



మట్టి గణేశుడిని తీర్చిదిద్దుతూ..



విజేతలు వీరే



మట్టి గణపయ్య ప్రతిమల తయారీ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని ఎస్‌డీ ఫిజా పర్వీన్‌కు బహుమతి అందజేస్తున్న ఈఈ రాజశేఖర్



ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థిని కె.చర్విత



తృతీయ బహుమతి సాధించిన విద్యార్థి వి.యశ్వంత్

చిన్నారుల చేతుల్లో చిట్టిగణపతుల పోటీల్లో ఎస్.డి.ఫిజాపర్వీన్ (ప్రథమ), కె.చర్విత (ద్వితీయ), వి.యశ్వంత్ (తృతీయ) బహుమతులను అందుకున్నారు. ఎస్‌కే సాద్, వి.యాశ్రిత, బి.హేమసిద్ధిక్‌సాయి, వి.లహరి, జి.చరణ్‌శివమాలిక్, ఎం.సాత్విక్ తదితరులు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. వీరికి ముఖ్యఅతిథులు బహుమతులను అందజేసి అభినందించారు.

కాపుల ఆర్థిక పరిపుష్టికే కాపునేస్తం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- జిల్లాలో 6,919 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10.38 కోట్లు జమ



కాపునేస్తం నమూనా చెక్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్, జేసీ

నెల్లూరు(దర్గామిట్ట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం కాపునేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. వైఎస్సార్ కాపునేస్తం 4వ విడత రాష్ట్రవ్యాప్తంగా 3,57,844 మంది కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల లబ్ధిదారుల ఖాతాల్లో రూ.536.766 కోట్లు జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కె.వెంకటనారాయణ ముదిరాజ్, జంగం కార్పొరేషన్ చైర్‌పర్సన్ వి.ప్రసన్న, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ ఎస్.కిషోర్‌సింగ్, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సయ్యద్ ఆసిఫా, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, వైఎస్సార్ కాపునేస్తం లబ్ధిదారులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ నెల్లూరు నగర మేయర్, జేసీలతో కలిసి వైఎస్సార్ కాపునేస్తం పథకానికి సంబంధించి జిల్లాలో 6,919 మంది కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల లబ్ధిదారులకు రూ.10.38 కోట్ల మెగా నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైఎస్సార్ కాపునేస్తం పథకం నాలుగో విడతలో రాష్ట్రంలోని 45 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు గల 3,57,844 మంది కాపు మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున విడుదల చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో 6,919 మంది లబ్ధిదారులకు రూ.10.38 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. నగర మేయర్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, అందులో భాగంగా కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల మహిళలకు వైఎస్సార్ కాపునేస్తం పథకం ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థికసాయం ద్వారా కాపు మహిళల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ కాపునేస్తం 4వ విడత నిధుల వివరాలు

నియోజకవర్గం	అర్హులు	జమచేసిన నగదు (రూ.కోట్లలో)
ఆత్మకూరు	497	0.75
కందుకూరు	793	1.19
కావలి	954	1.43
కోవూరు	825	1.24
నెల్లూరు సిటీ	1,765	2.65
నెల్లూరురూరల్	53	0.08
సర్వేపల్లి	534	0.80
ఉదయగిరి	1,004	1.51
వెంకటగిరి (రాపూరు, సైదాపురం, కలువాయి)	494	0.74
మొత్తం	6,919	10.38

వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు



రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాపునేస్తం కార్యక్రమం ద్వారా నాకు 4వ విడతలో రూ.15 వేల ఆర్థికసాయం అందించినందుకు ధన్యవాదాలు. ఈ ఆర్థికసాయం నా వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతుంది. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– గుడి లక్ష్మి, చాకలివీధి, నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు



వైఎస్సార్ కాపునేస్తం పథకం ద్వారా నాకు రూ.15 వేలు ఆర్థికసాయం అందించడం ఆనందంగా ఉంది. కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం కాపునేస్తం పథకాన్ని అమలు చేయడం సంతోషకరం. మాకు ఆర్థికసాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– వెలిశెట్టి లక్ష్మీదేవి, చాకలివీధి, నెల్లూరు

కాపు మహిళలకు ఆర్థిక భరోసా



కాపునేస్తం నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా కాపు, బలిజ, తెలగ, ఒంటరి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా నరుకూరు–తోటపల్లిగూడూరు ప్రధాన రహదారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3.75 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం నాల్గో విడత కాపునేస్తం పథకం కింద సర్వేపల్లి నియోజకవర్గంలోని 534 మందికి సంబంధించిన రూ.80 లక్షల నమూనా చెక్కును మంత్రి కాకాణి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఇస్కపాళెం పంచాయతీలో నూతనంగా నిర్మించిన సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీలను మంత్రి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఇసనాక రమేష్‌రెడ్డి, కోడూరు దిలీప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో..

- మతి స్థిమితంలేని యువకుడిపై దాడి
- మొబైల్‌లో చిత్రీకరించి పైశాచికానందం
- పోలీసుల అదుపులో ఐదుగురు యువకులు



సాగర్‌పై దాడికి పాల్పడుతున్న యువకులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో గంజాయి విక్రయాలు గుట్టుగా సాగుతుండడంతో యువత మత్తులో తేలాడుతున్నారు. ఆ మత్తులోనే ఒకరిపై ఒకరు దాడులకు తెగబడుతూ వీరంగం సృష్టిస్తున్నారు. పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం వెనుక ఖాళీ స్థలాల్లో రెండ్రోజుల క్రితం గంజాయి మత్తులో మతిస్థిమితం లేని సాగర్ అనే యువకుడిపై విచక్షణా రహితంగా తోటి మిత్రులే దాడికి పాల్పడ్డారు. ఈ దృశ్యాలను వారిలో ఒకరు మైబైల్‌లో చిత్రీకరించి పైశాచికానందం పొందుతూ వైరల్ చేయడంతో దాడి ఘటన వెలుగులోకి వచ్చింది. వందూరుగుంటకు చెందిన సాగర్ తల్లిదండ్రులు మృతి చెందడంతో నాయనమ్మ వద్ద పెరుగుతున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడి మతిస్థిమితం కోల్పోయాడు. గంజాయికి బానిసై అది లేనిదే జీవించలేని పరిస్థితికి చేరుకున్నాడు. గతంలో జ్యోతినగర్‌లోని ఓ ఇంటి వద్ద గంజాయి విక్రయాలు చేస్తుండగా సెబ్ అధికారులు దాడులు చేసి పట్టుకుని కేసులు నమోదు చేశారు. అదే ఇంటికి సాగర్ వెళ్లి గంజాయి ఉందా అని అడగగా ఆ ఇంటికి చెందిన ఆదర్శ్ ఇరిగేషన్ కార్యాలయాల వెనుకవైపునకు తీసుకెళ్లాడు. అక్కడ గంజాయి మత్తులో తన మిత్రులతో కలిసి విచక్షణా రహితంగా సాగర్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ దృశ్యాలను వారిలో ఒకరు మొబైల్‌లో చిత్రీకరించి పైశాచిక అనందం పొందుతూ వైరల్ చేయడంతో వెలుగులోకి వచ్చింది. దీంతో ఆత్మకూరు సీఐ జీ వేణు ఆధ్వర్యంలో ఎస్సైలు ముత్యాల రావు, సాయి ప్రసాద్‌లు దాడికి పాల్పడిన నిందితులను గుర్తించారు. పట్టణంలోని జ్యోతినగర్, ఎల్‌ఆర్‌పల్లికు చెందిన ఇద్దరు యువకులతో పాటు బండారుపల్లి, మురగళ్ల చెందిన మరో ముగ్గురు యువకులను శనివారం అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు సాగర్, అతని నాయనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా రవాణా..

హైదరాబాద్ నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ద్వారా ఏఎస్‌పేటకు గంజాయి చేరుతోంది. అక్కడ్నుంచి ఆత్మకూరుకు తరలిస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్‌లో వచ్చే గంజాయి ప్యాకెట్లను వింజమూరు–ఆత్మకూరు మార్గం మధ్యలో పానుగోడు రోడ్డు, ఏఎస్‌పేట అడ్డరోడ్డు సమీపంలోనూ కొందరు ముందుగా దించుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయమై ఆత్మకూరు సెబ్ సీఐ నయనతారను సంప్రదించగా గంజాయి విక్రయాలపై నిఘా ఉంచి దాడులు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కొండమీదకొండూరులో 8 కేజీలు, లింగంగుంటలో 5 కేజీలు, వెదనపర్తిలో పావు కేజీ, ఆత్మకూరులో పావు కేజీ చొప్పున గంజాయి పట్టుకుని కేసులు నమోదు చేశామని చెప్పారు.

రైల్లో గంజాయి అక్రమ రవాణా

- ముగ్గురి నిందితుల అరెస్ట్
- 24 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావు

నెల్లూరు(క్రైమ్): రైల్లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసుల ప్రత్యేక బృందం అరెస్ట్ చేసింది. వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువ చేసే 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుంది. శనివారం నెల్లూరు రైల్వే డీఎస్పీ పీ మల్లికార్జునరావు తన కార్యాలయంలో నిందితుల వివరాలను వెల్లడించారు. శనివారం వేకువన విశాఖ నుంచి చెన్నై సెంట్రల్‌కు వెళుతున్న రైల్లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు రైల్వే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో రైల్వే డీఎస్పీ పీ మల్లికార్జునరావు పర్యవేక్షణలో నెల్లూరు రైల్వే సీఐ శ్రీనివాసాచారి సిబ్బందిని అప్రమత్తం చేశారు. గూడూరు రైల్వే ఎస్సై కొండపనాయుడు తన సిబ్బందితో గూడూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. రైల్లో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనున్న నాలుగు బ్యాగులను తనిఖీ చేయగా 12 ప్యాకెట్లు (24 కేజీలు) పట్టుబడ్డాయి. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రైల్వే పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఒడిశా సరిహద్దు నుంచి..

తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లా పెన్నాడమ్‌కు చెందిన నితియన్, కలకురిచి జిల్లా సోమశిపాళేనికి చెందిన కుమారవేల్, మైలాడుదురై జిల్లా సిర్‌కాలీకి చెందిన గణేష్ స్నేహితులు. అందరూ 23ఏళ్లలోపు వారే. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు గంజాయికి బానిసయ్యారు. వ్యసనాల కోసం నగదును సులభంగా సంపాదించాలని గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి రైలు మార్గాన తమిళనాడు రాష్ట్రానికి తరలించి అక్కడ అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. ఈ మేరకు నిందితులు విచారణలో వెల్లడించడంతో వారిని అరెస్ట్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి పెద్ద ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్న నెల్లూరు రైల్వే సీఐ కే శ్రీనివాసాచారి, గూడూరు ఎస్సై కొండపనాయుడు, వారి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. రివార్డులకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. ఈ సమావేశంలో రైల్వే సీఐ శ్రీనివాసాచారి, గూడూరు ఎస్సై కొండపనాయుడు పాల్గొన్నారు.

నగరంలో డీజీపీ

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి తిరుపతి వెళుతూ శుక్రవారం రాత్రి నెల్లూరు పోలీసు అతిథిగృహానికి చేరుకున్నారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి జిల్లాలోని పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రాత్రి అతిథిగృహంలో బసచేసిన డీజీపీ శనివారం రోడ్డు మార్గన తిరుపతికి వెళ్లారు.

ఎస్పీడీసీఎల్ సీజీఎంగా రమణదేవి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్‌మేనేజర్(హెచ్‌ఆర్‌డీ)గా జిల్లాకు చెందిన రమణదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకు చెందిన ఆమె జిల్లా సర్కిల్‌లో సుదీర్ఘకాలం ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం ఉద్యోగోన్నతిపై తిరుపతి కార్పొరేట్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ప్రస్తుతం సీజీఎంగా ఉద్యోగోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన సీజీఎంకు ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు, సీజీఎంలు, ఎస్‌ఈలు, జిల్లాకు చెందిన ఈఈలు, ట్రేడ్‌యూనియన్ల, అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు.

బాంబు ఉందని ఫేక్‌కాల్

• నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): రైల్వేస్టేషన్‌లో బాంబ్ ఉందని ఫేక్ కాల్‌చేసి ప్రయాణికులను భయాందోళనలకు గురిచేయడంతో పాటు రైల్వే అధికారులను తప్పుదోవ పట్టించిన ఘటనలో నిందితుడిని నెల్లూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం నెల్లూరు రైల్వే డీఎస్పీ పీ మల్లికార్జునరావు తన కార్యాలయంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. వివరాలు..నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌లోని వెయిటింగ్‌హాల్‌లో గడ్డంతో ఉన్న వ్యక్తి బాంబ్‌తో ఉన్నాడని, అది ఎప్పుడైనా పేలవచ్చని ఈ నెల 4న మధ్యాహ్నం సుమారు 3.40 గంటల సమయంలో 112కు గుర్తుతెలియని వ్యక్తి కాల్ చేశాడు. దీంతో రైల్వే డీఎస్పీ పీ మల్లికార్జునరావు పర్యవేక్షణలో రైల్వే సీఐ కే శ్రీనివాసాచారి, సంతపేట ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్‌రాజు రైల్వేస్టేషన్‌లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. బాంబ్ లేకపోవడంతో ఫేక్‌కాల్ అని తేలింది. సాంకేతికత ఆధారంగా ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురానికి చెందిన వెంగళరావు నెల్లూరులోని బార్లలో సప్లయర్‌గా పనిచేస్తూ మద్యం మత్తులో అందర్నీ భయాందోళనలకు గురిచేసేందుకు ఫేక్‌కాల్ చేశాడని గుర్తించారు. నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన కోర్టు అనుమతితో నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు శనివారం నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తరహా చర్యలకు ఎవ్వరు పాల్పడినా కఠిన చర్య లు తప్పవని హెచ్చరించారు. నెల్లూరు రైల్వే సీఐ కే శ్రీనివాసాచారి, ఆర్పీఎఫ్ సీఐ బీ వసంతరావు, ఎస్సై హరిచందన పాల్గొన్నారు.

మైపాడు బీచ్ స్థాయి పెంపునకు ప్రతిపాదనలు

ఇందుకూరుపేట: మైపాడు బీచ్ స్థాయి పెంపునకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు పర్యాటక శాఖ తిరుపతి రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ తెలిపారు. మైపాడు బీచ్‌ను ఎస్కే ఆర్కిటెక్ట్ బృందంతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత అనువైన బీచ్‌లలో విశాఖపట్నం రుషికొండ, మైపాడు మాత్రమే ఉన్నాయన్నారు. మైపాడు బీచ్‌ను విదేశీ స్థాయి ప్రమాణాలతో అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామని తెలిపారు. అందులో భాగంగా మత్స్యకారుల మత్స్య షాపులను విస్తరించి పెద్ద ముఖద్వారం ఏర్పాటు చేస్తామన్నారు. సందర్శకుల వినోదానికి సురక్షిత ఈత కొలను, వాటర్ స్పోర్ట్స్, స్కేటింగ్, రోలింగ్, చిల్డ్రన్ పార్క్, స్నానపు గదులు, వసతి గదులు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. బీచ్‌లోని ఆలయాలను మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ రాజేష్, ఎస్కే ఆర్కిటెక్ట్ ఇంజినీర్ సుజిత్ కుమార్, జిల్లా అధికారి సాయికృష్ణ, డీఈఈ వంశీ, ఫిషరీష్ డెవలప్‌మెంట్ అధికారి సురేష్, ఆర్‌ఐ జీవన్, సర్వేయర్ హరినాథ్ ఉన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	136
లేయర్ (లైవ్)	113
బ్రాయిలర్ చికెన్	234
బ్రాయిలర్ స్కిన్‌లెస్	260
లేయర్ చికెన్	192



నిమ్మధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	రూ. 75
సన్నవి	రూ. 40
పండ్లు	రూ. 12

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.